ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024

పంచాయతీలకు
రూ.79.1 కోట్ల నిధులు విడుదల

▸▸ సర్పంచుల హర్షం



అనకాపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీలకు రూ.79.1 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులు దారి మళ్లించి పంచాయతీల ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేయడంతో గ్రామ సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో 640 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని మొదటి వాయిదా కింద విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.79.1 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. పంచాయతీలకు విడుదలైన ఆర్థిక సంఘం నిధులతో తాగునీరు, శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు వంటి పనులకు వినియోగించాల్సి ఉంటుంది. కాగా ఒకటి, రెండు రోజుల్లో ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ అవుతాయని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీష తెలిపారు.

ఇసుక తోడేళ్లు

సముద్రపు ఇసుకనూ వదలని అక్రమార్కులు

▸▸ తోటల్లో నిల్వ చేసి సాధారణ ఇసుకలో మిక్సింగ్
▸▸ లారీలు, ట్రాక్టర్లలో తరలించి విక్రయాలు
▸▸ కారిడార్ భూముల్లోనూ అక్రమ తవ్వకాలు

నక్కపల్లి, ఆగస్టు 26:
ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండా పోయింది. అక్రమార్కులు సముద్రపు ఇసుకను కూడా వదలడం లేదు. ఎడ్లబండ్లతో సముద్రపు ఇసుకను తరలించి తోటల్లో నిల్వ చేసి సాధారణ ఇసుకలో కలిపేసి విక్రయించేస్తున్నారు. తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న కారిడార్ భూముల్లో సైతం ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి దర్జాగా విక్రయించేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మండలంలోని డీఎల్‌పురం, అమలాపురం, వేంపాడు, రాజయ్యపేట గ్రామాల్లో విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం దాదాపు 5 వేల ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. అయితే తీర ప్రాంతానికి ఆనుకుని వున్న ఈ కారిడార్ భూముల్లో సైతం కొందరు అక్రమ వ్యాపారులు ఇసుకను తవ్వి తరలించేస్తున్నారు. ఏపీఐఐసీ, మైన్స్, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడంతో అక్రమార్కులకు అడ్డే లేకుండాపోయింది.


నక్కపల్లి మండలం డీఎల్‌పురంలో సముద్రపు ఇసుకను నిల్వ చేసిన దృశ్యం

సముద్రపు ఇసుకను కలిపేసి విక్రయాలు

సాధారణంగా గృహాలు, ఇతర కట్టడాలకు సముద్రపు ఇసుకను వినియోగించరు. నదుల నుంచి వచ్చిన ఇసుకనే వాడతారు. అయితే ఇసుకకు డిమాండ్ ఉండడంతో ట్రాక్టర్ సాధారణ ఇసుకలో మరో ట్రాక్టర్ సముద్రపు ఇసుకను కలిపేసి కొందరు విక్రయించేస్తున్నారు. తీర ప్రాంతాల్లో తవ్విన సముద్రపు ఇసుకను తోటల్లో నిల్వ చేస్తున్నారు. ఆ ఇసుకను ముందుగా నీళ్లతో తడుపుతున్నారు. ఆరబెట్టిన తరువాత నది ఇసుకలో కలిపేసి లారీల్లో నింపి అచ్యుతాపురం, పరవాడ, ఎలమంచిలి, రాంబిల్లి, తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఈ నెల 24న డీఎల్‌పురం నుంచి రెండు లారీల్లో సముద్రపు ఇసుకను తరలిస్తుండగా వేంపాడు హైవే జంక్షన్ వద్ద నక్కపల్లి

... మిగతా 8వ పేజీలో


ఎడ్ల బండిపై సముద్రపు ఇసుకను తోటల్లోకి తరలిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా అక్రమ రవాణా


కోటవురట్లలో టైరు బండ్లతో ఇసుక తరలిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కోటవురట్ల, ఎస్‌రాయవరం మండలాల సరిహద్దు ప్రాంతమైన ఇందేశమ్మవాక సమీపంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వరహానదిలో కొందరు వైసీపీ నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి పందూరు, రామచంద్రపురం గ్రామాల్లో రాత్రి వేళ యథేచ్ఛగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నదిలోకి ట్రాక్టర్లు, లారీలు దిగితే ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన అక్రమార్కులు ఎడ్ల బండ్లపై ఇసుకను తరలించి కొంత దూరంలో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతం నుంచి నిత్యం రేయింబవళ్లు ఇసుకను దర్జాగా తరలించేస్తున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కశింకోట కోనేరు గట్టు వద్ద గల ఆలయంలో శ్రీకృష్ణుడు

జిల్లాలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుని ఆలయాల్లో స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. - కశింకోట

912 కిలోల గంజాయి స్వాధీనం

▸▸ విలువ రూ.45 లక్షలు
▸▸ ఇద్దరి అరెస్టు, లారీ సీజ్

- వార్త మెయిన్‌లో..


లారీ క్యాబిన్ వెనుక తయారు చేసిన బాక్సులోని గంజాయిని బయటకు తీస్తున్న ఎస్ఐ ధనుంజయ్

'సినర్జిన్' ఫార్మా ప్రమాదంలో మరో ఇద్దరి మృతి

▸▸ మూడుకు చేరిన మృతుల సంఖ్య

- వార్త మెయిన్‌లో..


జంపెన వద్ద గోతులు పడిన రోడ్డు

దడ పుట్టించే దారి

గోతులమయంగా కింతలి రోడ్డు

▸▸ వర్షమొస్తే చెరువే..
▸▸ భీతిల్లుతున్న వాహనచోదకులు

మాడుగుల రూరల్, ఆగస్టు 26:
అడుగడుగునా గోతులు.. వర్షం పడితే చెరువును తలపించే మార్గం. ఇటుగా వెళ్లాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గత్యంతరం లేక రాకపోకలు సాగిస్తున్నారు.. ఇదీ ఘాట్ రోడ్డు నుంచి కింతలి వెళ్లే రోడ్డు దుస్థితి.

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణను పట్టించుకోకపోవడం వల్లే పరిస్థితి అధ్వానంగా తయారైంది. మండలంలోని గాదిరాయి, వీజేపురం, వమ్మలి, కేజేపురం జంక్షన్, తదితర గ్రామాల్లోని తారు రోడ్లు గోతులమయంగా ఉన్నాయి. ఇక జంపెన వద్ద పరిస్థితి ఘోరంగా ఉంది. ఈ మార్గం గుండా గాదిరాయి, వమ్మలి, జమ్మాదేవిపేట, కింతలి, జాలంపల్లి, పొన్నవోలు, తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే అనకాపల్లి- కింతలి, విశాఖపట్నం- కింతలి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఈ మార్గంలో పెద్ద గోతులు ఉండడంతో చాలా జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలు ఈ మార్గంలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. రాత్రి వేళ అయితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబు

▸▸ రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు
▸▸ డీన్లుగా మరికొందరు ఆచార్యులు


ఎస్.కిశోర్‌బాబు


ధనుంజయరావు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య ఎన్.కిశోర్‌బాబు రెక్టార్‌గా నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్, గత పాలకుల హయాంలో ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా పనిచేసిన ఇఎస్.ధనుంజయరావును నియమించారు. ఈ మేరకు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వరకుమార్‌ను, ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణను, సీడీసీ డీన్‌గా ఆచార్య టీవీ కృష్ణను, స్టూడెంట్ అఫైర్స్ ఇన్‌చార్జి డీన్‌గా డాక్టర్ జి. రాంబాబును, అసోసియేట్ డీన్లుగా ఎన్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, ఏఈఆర్‌సీ గౌరవ డైరెక్టర్‌గా ఆచార్య లిల్లీ గ్రేస్‌ను, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె. వెంకటరమణను, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి. రామారావును, ఐఎఎస్ఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డి.నాగరాజకుమారిని నియమించారు. ఇదిలావుండగా రిజిస్ట్రార్‌గా ఆచార్య ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

పాత వారికే పట్టం! - 7వ పేజీలో

బీఎస్ఎన్ఎల్ జోష్

▸▸ ప్రైవేటు ఆపరేటర్లు టారిఫ్‌లు పెంచడంతో ప్రభుత్వ రంగ సంస్థ వైపు వినియోగదారుల చూపు



▸▸ ఉమ్మడి జిల్లాలో గత నెల కొత్తగా 18,800 మంది కస్టమర్లు చేరిక
▸▸ అందులో 12,000 మంది ప్రైవేటు కంపెనీల వినియోగదారులే...
▸▸ ప్రస్తుతం ప్రీ, పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది
▸▸ మరిన్ని 4జి టవర్లు ఏర్పాటు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):
బీఎస్ఎన్ఎల్... ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి, గత కొన్నాళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ. ఇప్పుడు కాస్త నిలదొక్కుకునేందుకు యత్నిస్తోంది. ఇటీవల ప్రైవేటు టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియాలు ఇష్టానుసారంగా టారిఫ్‌లు పెంచేశాయి. దీంతో గత నెల రోజులుగా ఆయా సంస్థల వినియోగదారులు లక్షలాది మంది బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి మారిపోతున్నారు. ఒక్క జూలై నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా 2.2 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ తీసుకోగా, వీరిలో 1.4 లక్షల మంది జియో, ఎయిర్‌టెల్, వీఐ నుంచి మొబైల్ నంబర్ పోర్టబులిటీ (ఎంఎన్‌పీ) పొందిన వారు ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ ఈ సంఖ్య భారీగా ఉందని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ ఎన్ఎల్) అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో జూలై నెలలో 18,800 వేల మంది కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో చేరగా, వీరిలో ఎంఎన్‌పీ ద్వారా ఇతర టెలికాం సంస్థల నుంచి వచ్చినవారు 12 వేల మంది వరకూ ఉన్నారు. ఈ నెలలో మొదటి పది రోజుల్లోనే సుమారు నాలుగు వేల మందికిపైగా కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి వచ్చారు. వీరిలో మూడు వేల మంది ఇతర టెలికాం సంస్థల నుంచి మారినవాళ్లే.

భారీగా పెరిగిన ధరలు

గతంలో జియో రోజుకు 1 జీబీ సామర్థ్యం, 28 రోజుల వ్యాలిడిటీ ప్యాకేజీ రూ.199 ఉండగా, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.250కి పెంచింది. 1.5 జీబీ సామర్థ్యం, 28 రోజులు వ్యాలిడిటీ ప్లాన్‌ను రూ.239 నుంచి రూ.299కు, 2 జీబీ సామర్థ్యం, 28 రోజులు వ్యాలిడిటీ కలిగిన ప్లాన్‌ను రూ.299 నుంచి రూ.349కు పెంచింది. జియోతోపాటు ఇతర టెలికాం సంస్థలు భారీగా టారిఫ్‌లు పెంచాయి.

కొత్తగా 800 4జి టవర్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు 420 టవర్లు ఉన్నాయి. వీటిని ... మిగతా 8వ పేజీలో

డిజైన్ లోపమే ఎసెన్షియా ప్రమాదానికి కారణం

▸▸ నిర్ధారించిన నిపుణులు
▸▸ డిజైనర్ కోసం వెతుకులాట
▸▸ బీమా కంపెనీ ప్రతినిధులు వచ్చిన తరువాతే విచారణ
▸▸ త్వరలో యజమానిపై క్రిమినల్ కేసు


దట్టంగా పొగ వ్యాపించిన ఎసెన్షియా ఫార్మా కంపెనీ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):
అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కర్మాగారంలో భవన నిర్మాణ డిజైన్ లోపంతోనే ప్రమాదం జరిగిందని నిపుణులు నిర్ధారించారు. పైపులు లీకై ఏసీ గదిలో ప్యానళ్లపై పడి ఆవిరి మేఘంగా మారి తరువాత స్పార్క్ వచ్చి భారీ ప్రమాదం సంభవించిందని గుర్తించారు. భవనం లోపల పైపులు ఎలా ఏర్పాటుచేశారని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ విభాగం వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. ఇటువంటి నిర్మాణాలు చాలా ప్రమాదాలకు దారి తీస్తాయని తెలిసి కూడా భవన నిర్మాణాలకు ఇలా డిజైన్ ఎలా చేశారని ప్రశ్నిస్తున్నాయి.

సాధారణంగా ఇటువంటి కర్మాగారాల్లో సాల్వెంట్ పైపులు భవనం బయటకు ఉండేలా డిజైన్ చేస్తారు. పరవాడ, అచ్యుతాపురంలోని అనేక ఫార్మా, రసాయన కంపెనీల్లో రియాక్టర్ నుంచి సాల్వెంట్ పైపులు భవనం బయట నుంచి పనిచేసేలా ఏర్పాటు చేశారు. ఒక్క ఎసెన్షియా కర్మాగారంలోనే రియాక్టర్ నుంచి సాల్వెంట్ తీసుకువచ్చే పైపులు భవనంలోని ఏసీ గదిలోకి వచ్చేలా రూపొందించారు. ఈ కంపెనీలో ప్రమాదం తరువాత పరవాడ, అచ్యుతాపురంలో అన్ని కంపెనీల నుంచి వివరాలు తీసుకుంటే సాల్వెంట్ పైపులు భవనం వెలుపల నుంచి ఏర్పాటుచేసినట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఎసెన్షియా కంపెనీకి సంబంధించి భవనం డిజైన్ రూపొందించిన వ్యక్తి/సంస్థ ఎవరన్నది అన్వేషిస్తున్నారు. థర్డ్‌పార్టీగా ఉండే ఇటువంటి వ్యక్తుల అడ్రస్ భవనం కూలిపోడంతో లభించడం లేదని తెలిసింది. అయితే కంపెనీ యజమాని లేదా అతని ప్రతినిధులను సంప్రతించి డిజైనర్‌ను కంపెనీ వద్దకు తీసుకురావాలని భావిస్తున్నారు. కాగా కంపెనీలో భారీ ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని బీమా కంపెనీ ప్రతినిధులు సందర్శించనున్నారు. అటు తరువాతే ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేయనున్నారు. కర్మాగార ఆవరణలో శిథిలాలు తొలగించే సమయంలో ప్రమాదానికి ఆధారాలు ఏమైనా లభిస్తాయా? అనే ఆలోచన చేస్తున్నారు. ప్రమాదంలో 17మంది మృతికి సంబంధించి కంపెనీ యజమానిపై త్వరలో కేసు నమోదు చేయనున్నారు. కంపెనీలో వాటాలపై ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదంఉన్నప్పటికీ కంపెనీ ఏర్పాటుసమయంలో అన్ని అనుమతులకు దరఖాస్తుచేసి, సంబంధిత డాక్యుమెంట్లపై సంతకాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తారు.

క్రైం... crime news

వరహా నదిలో గల్లంతైన కూలి మృతి



వరహా నదిలో బంగారయ్య మృతదేహం వెలికితీసిన దృశ్యం

కోటవురట్ల, ఆగస్టు 26 : మండలంలోని పందూరు వద్ద గల వరహా నదిలో గల్లంతైన కూలి మృతదేహం లభ్యమైంది. కొత్తగొట్టివాడ గ్రామానికి చెందిన సుంకర బంగారయ్య, అలి యాస్ పోతురాజు (55) ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి పందూరులో సరుగుడు తోట నరికేందుకు కూలి పని నిమిత్తం సైకిల్‌పై బయల్దేరాడు. రామచంద్రపురం జంక్షన్ మీదుగా పందూరు వరహా నదిపై ఉన్న వంతెన వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి సైకిల్‌ను భూజంపై మోసుకుంటూ నది దాటే క్రమంలో నీటి ఉధృతికి సైకిల్‌తో సహ కొట్టుకుపోయాడు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు చూసి కేకలు వేశారు. ఈ విషయాన్ని పందూరు గ్రామస్థులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో అతని ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో ఆదివారం, సోమవారం గాలించగా ఉదయం పది గంటలకు నదిలో మృతదేహం బయటపడింది. ఇది చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బంగారయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

లీగల్ ఒపీనియన్‌కు నకిలీ హారం కేసు

నర్సీపట్నం, ఆగస్టు 26 : శ్రీమహాలక్ష్మి అమ్మవారి బంగారం ఆభరణాలలో వెలుగు చూసిన నకిలీ హారం కేసు పట్టణ పోలీసులు లీగల్ ఒపీనియన్‌కి పంపించారు. ఈవో గంగారావు, ఇన్‌చార్జి ఈవో దివ్యజ్యోతి ఒకరి మీద ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీని మీద లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

'పాత పెన్షన్ విధానం అమలుకు పోరాడాలి'



సదస్సులో మాట్లాడుతున్న వక్త

విశాఖపట్నం, ఆగస్టు 26 : పాత పెన్షన్ విధానానికి మోదీ మంత్రివర్గం ఆమోదించిన ఏకీకృత పెన్షన్ విధానం ప్రత్యామ్నాయం కాదని, దీనిని అందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి కేఎస్ ఉమేష్ పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో 'ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు - ఓపీఎస్ సాధన- కార్మికవర్గ పాత్ర'పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏకీకృతపెన్షన్ విధానంపై దేశంలోనే మొదటిసారిగా సదస్సు నిర్వహించిన విశాఖపట్నం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీని అభినందిస్తున్నామన్నారు. రాష్ట్రాలలో త్వరలో జరగబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని లబ్ధి పొందడం కోసమే ఏకీకృత పెన్షన్ విధానాన్ని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. ఎనిమిదో వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటీకరణకు, ప్రైవేటీకరణకు, కార్మిక కోడ్స్ పేరుతో కార్మిక చట్టాల మార్పునకు వ్యతిరేకంగా కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఏఐడీఈఎఫ్ మాజీ అదనపు కార్యదర్శి గుహతకుర్తా మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదని, కార్మికుల హక్కని సుప్రీంకోర్టు విశదీకరించిందన్నారు. సదస్సుకు డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఐదేళ్ల పదవుల్లో ఉండే ఎంపీలు పెన్షన్ తీసుకుంటారన్నారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ డివిజన్ కార్యదర్శి బోలేనాథ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు,కాన్ఫడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టీఎస్‌టీయూసీ ప్రధానకార్యదర్శి కె.నాగార్జున, నావెల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.


బీచ్ రోడ్డులో ఆర్మీ ర్యాలీ

▸▸ భారీ వర్షంతో వేదికను మార్చిన అధికారులు



బీచ్‌రోడ్డులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఆగస్టు 26 : ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని సోమవారం తెల్లవారుజామున సాగరతీరంలో నిర్వహించారు. విశాఖ నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ ర్యాలీ సోమవారం అర్ధరాత్రి ప్రారంభమయింది. ఇందుకోసం స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో మైదానం, రన్నింగ్ ట్రాక్ మొత్తంబురదమయమైపోయింది. అభ్యర్థులు బురదలోజారిపోయి గాయాలపాలవుతారని భావించినఅధికారులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచనతో ర్యాలీని బీచ్‌రోడ్డుకు మార్పు చేశారు. దీంతో తెల్లవారుజామున ర్యాలీ తీరంలో ప్రారంభమయింది. ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నప్పటికీ అభ్యర్థులు లెక్కచేయకుండా ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.



టార్గెట్ చేరుకుంటున్న అభ్యర్థి

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

పారిశ్రామికవాడ.. రోడ్లు చూస్తే దడ..

▸▸ అస్తవ్యస్తంగా మారిన ఏపీఐఐసీ ప్రధాన రహదారి
▸▸ రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
▸▸ పట్టించుకోని అధికారులు
▸▸ అవస్థలు పడుతున్న జనం

అచ్యుతాపురం, ఆగస్టు 26 : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి రహదారుల దుస్థితి దర్పణంగా నిలుస్తోంది. ఏ ప్రాంతంలో చూసినా గతుకులమయం కాగా, కొన్నిచోట్ల రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి ఏపీఐఐసీ ప్రధాన రహదారి దుస్థితి మరీ దారుణంగా ఉంది. అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వరకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో బాగా పాడైపోయింది. సెజ్‌లో కర్మాగారాలు ఏర్పాటు చేసిన తర్వాత ఈ రోడ్డును ఏపీఐఐసీ నాలుగు రోడ్లుగా విస్తరించింది. కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులను తీసుకు వెళ్లే బస్సులతో పాటు యంత్ర సామగ్రి, విడి భాగాలు తీసుకు వెళ్లే భారీ నుంచి అతి భారీ వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు ఈ రోడ్డు గుండానే సాగిస్తుంటాయి. అయినప్పటికీ ఈ రోడ్డును ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డులో దుప్పితూరు వద్ద ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయం ఉంది. ఆ ముందు రోడ్డే గుంతలు పడి పాడైపోయింది.



పూడిమడక వద్ద రోడ్డు మధ్యలో గోతులు



ఏపీఐఐసీ కార్యాలయం ముందు జంక్షన్ వద్ద దుస్థితి

ఇక ఏపీఐఐసీ అధికారులు అచ్యుతాపురం జంక్షన్ మీదుగా ఇదే రోడ్డులో వెళ్లి వస్తుంటారు. అయినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇదిలావుంటే, పూడిమడక ఉన్నత పాఠశాల పక్కన ఏపీఐఐసీ రోడ్డును ఆనుకొని నీటి పైప్‌లైన్ కోసం పెద్ద గొయ్యిని నెల రోజుల క్రితం తవ్వి వదిలేశారు. ఇక్కడ ఉన్న డబుల్ రోడ్డులో ఒక రోడ్డు మధ్యలో గోతులు పడగా, మరో రోడ్డు పక్క పైప్‌లైన్ కోసం తవ్విన పెద్ద గుంత భయపెడుతోంది. పూడిమడక ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ గుంతను దాటుకొని వెళ్లాలి. అలాగే పూడిమడక-లోవపాలెం రోడ్డులో గల సన్విరా కర్మాగారం నుంచి పొడవైన భారీ ట్రాలర్లు ఈ గుంతను తప్పించుకొని వెళ్లాలి. పూడిమడక- లోవపాలెం జంక్షన్ మలుపులో ఈ గుంత ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు హడలిపోతున్నారు. ఈ రోడ్డు దుస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఒక్క అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధి చేస్తే చాలదని, కర్మాగారాలకు వెళ్లే రోడ్లను కూడా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పూడిమడక ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు పక్కన భారీ గొయ్యి

ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలి

▸▸ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

పాయకరావుపేట, ఆగస్టు 26 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, సీపీఎస్ కాకుండా పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం పాయకరావుపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయి పీఆర్‌టీయూ సమావేశంలో మాట్లాడారు. 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై ప్రభుత్వం పునరాలోచన చేసి ఎన్‌రోల్‌మెంట్ ఆగస్టు తొమ్మిదో తేదీ కాకుండా ఆగస్టు 16వ తేదీన మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలలో రోల్‌తో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. 12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించి తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల అధ్యక్షులు ఎ.ప్రకాష్, ఆర్.వీరభద్రరావు, టి.వెంకటరమణతో పాటు నాయకులు టి.సత్యనారాయణ, బాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

పాత వారికే పట్టం!

▸▸ఏయూలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి వర్గానికే కీలక పదవులు
▸▸ తెలిసి చేస్తున్నారా?, తెలియక చేస్తున్నారా??
▸▸ కూటమి మద్దతుదారుల్లో ఆందోళన
▸▸ ఇలాగైతే మాజీ వీసీపై విచారణ చేపట్టినా ఫలితం ఉండదనే అభిప్రాయాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీలక పోస్టుల విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ సానుభూతిపరులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వైసీపీ పాలనలో వీసీగా వ్యవహరించిన ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి యూనివర్సిటీని పార్టీ కార్యాలయంగా మార్చేసిన సంగతి తెలిసిందే. పార్టీకి ఉపయోగపడే వారికే కీలక పదవులు ఇచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ప్రసాదరెడ్డి చేసిన అడ్డగోలు వ్యవహారాలపై కమిటీ వేసి విచారణ చేయాలనే డిమాండ్ ఉంది. దీనిని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈలోగా కీలక పదవులను భర్తీచేస్తోంది. అయితే ప్రసాదరెడ్డి ద్వారా గతంలో ప్రయోజనం పొంది...కీలక స్థానాల్లో ఉన్నవారికే ఈ ప్రభుత్వం కూడా పెద్దపీట వేస్తోంది. దీనిని కూటమి మద్దతుదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రసాదరెడ్డి వెళ్లిపోతూ అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ఉన్న కిశోర్‌బాబును ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇప్పుడు ఆయనకు కూటమి ప్రభుత్వం రెక్టార్ పదవి కట్టబెట్టింది. ఇది వర్సిటీలో చాలా కీలకమైన పదవి. అకడమిక్ వ్యవహారాలన్నీ రెక్టారే చూస్తారు. అలాగే ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్‌గా ధనుంజయ్‌రావును ప్రసాదరెడ్డి నియమించుకున్నారు. తాజాగా వైస్ ఛాన్సలర్ పోస్టు ఖాళీ అయినప్పుడు దాని కోసం ధనుంజయ్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఆయన్ను కూటమి పెద్దలు రిజిస్ట్రార్‌గా నియమించారు. రెక్టార్, రిజిస్ట్రార్ రెండూ కీలక పదవులు. ఇవి ప్రసాదరెడ్డి బృందానికే దక్కడంతో యూనివర్సిటీలో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. రేపు ఆయనపై విచారణ చేస్తే కీలక పదవుల్లో ఉన్న వీరు దానిని ప్రభావితం చేయకుండా ఉంటారని ఎలా నమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. ఏయూకు సంబంధించిన నియామకాల్లో అమరావతి పెద్దలు విశాఖ జిల్లా నాయకులను సంప్రతించడం లేదని, అందుకే ఇలాంటి నిర్ణయాలు వెలువడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కింది నుంచి పైవరకూ ఒక సామాజికవర్గం వారికే పదవులు ఇచ్చుకొన్నారు. ఇప్పుడు సామాజిక వర్గాలను పక్కన పెట్టినా ఆ బృందానికే పదవులు ఇవ్వడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

నవంబరు 27న ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 26: శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 27 నుంచి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీ పోస్టర్‌ను సోమవారం విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఎస్-3 స్పోర్ట్సు ఎరీనా వేదికగా ఆరు రోజులపాటు జరిగే టోర్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలిండియా చెస్ సమాఖ్య, ఏపీ చెస్ సంఘం, విశాఖ శాఖ సంఘం పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని, వివిధ ప్రాంతాల రేటింగ్ క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీలో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు వివరించారు. చెస్ సంఘం ప్రతినిధులు ఏ.సురేష్, ఎస్.మణికంఠరావు, డాక్టర్ రామానుజస్వామి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

ఆంగ్లంలోనే పరీక్షలు

▸▸ నేటి నుంచి ప్రారంభం
▸▸ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందే...
▸▸ మండల కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాల పంపిణీ
▸▸ దశల వారీగా తెలుగు మాధ్యమం ఎత్తేసిన గత వైసీపీ ప్రభుత్వం

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 80 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి స్వీయ మదింపు పరీక్షలు (సెల్ఫ్ అసెస్‌మెంట్ టెస్ట్/ఫస్ట్ యూనిట్ టెస్ట్) ప్రారంభం కానున్నాయి. అయితే పాఠశాల విద్యా శాఖ చరిత్రలో తొలిసారిగా పరీక్షలు ఆంగ్లంలోనే జరగనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మొత్తం ఆంగ్లంలోనే నిర్వహిస్తున్నారు. అందుకే పరీక్షలు కూడా ఆంగ్లంలోనే రాయాలని విద్యార్థులకు సూచించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007-08లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో సెక్షన్లు ఉండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ బడుల్లో దశల వారీగా తెలుగు మాధ్యమం ఎత్తివేసేలా ప్రణాళిక అమలుచేసింది. 2024-25 సంవత్సరం నుంచి పూర్తిగా ఆంగ్లంలో బోధన, పరీక్షలు నిర్వహించేలా నిర్దేశించింది. దీనిపై భాషావేత్తలు, ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా పట్టించుకోలేదు. అదే సమయంలో ఆంగ్ల మాధ్యమంలో బోధన, పరీక్షలకు పిల్లలను సన్నద్ధం చేయడంలో విఫలమైంది. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది విద్యార్థులకు ఆంగ్లంలో బోధిస్తే అర్థం కాదు...ఇక ఆంగ్లంలో పరీక్షలు రాయడం అంటే మరింత ఇబ్బందికరమనే వాదన ఉంది. ప్రస్తుత ఏడాది విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలు ద్విభాష (ఇంగ్లీష్, తెలుగు)లో ముద్రించారు. తరగతి గదుల్లో ప్రధానంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మాతృభాషలోనే బోధన చేస్తున్నారు. చివరకు ఉన్నత పాఠశాలల్లో ఎక్కువమంది పిల్లలకు తెలుగు మీడియంలో బోధన చేస్తేనే అర్థమవుతుందని తెలిసినా ఎవరూ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం లేదు. విచిత్రమేమిటంటే...ఒరియా, ఉర్దూ మాధ్యమంలో చదువుకునే పిల్లలు ఆయా భాషల్లో పరీక్షలు రాసుకునే వెసులుబాటు ఉంది. కానీ తెలుగు మాట్లాడే మన పిల్లలకు మాతృభాషలో పరీక్షలు రాసుకునే అవకాశం ఇవ్వడం లేదు. దీనిపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తిలో ఉన్నా ఎవరూ బయటకు చెప్పడం లేదు.

నేటి నుంచి పరీక్షలు...

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెల నాలుగో తేదీ నుంచి స్వీయ మదింపు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ప్రతిరోజు ప్రశ్నపత్రాలు పంపిస్తారు. తొలిరోజు మంగళవారం సింహాచలంలో ఓరియంటల్ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఈ నెల 28 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, 28వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగోతేదీ నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రశ్నపత్రాలు లీకేజీకి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధిత యాజమాన్యాలు నిర్వహిస్తాయి.

'సినర్జిన్ ఫార్మా'లో మృతుని కుటుంబానికి పరిహారం

▸▸ రూ.కోటి చెక్కును అందజేసిన డీటీ



మృతుని కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీటీ శాంతిభూషణం

పరవాడ, ఆగస్టు 26 : ఇక్కడి ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా యూనిట్-3లో జరిగిన ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కెమిస్ట్ కోరాడ సూర్యనారాయణ కుటుంబానికి అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఈ మేరకు కోటి రూపాయల చెక్కును పరవాడ డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణం చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు సోమవారం విశాఖ కేజీహెచ్ వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, గనిశెట్టి సత్యనారాయణ, కె.చంద్రశేఖర్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, ఆగస్టు 26 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆదివారం రాత్రి ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు ప్రారంభించారు. మంగళవారం నాటికి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్‌లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

29న తుమ్మపాలలో ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 : ఆంధ్రప్రదేశ్ 34వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ ఖోఖో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఈనెల 29న అనకాపల్లి మండలం తుమ్మపాల క్రీడా మైదానంలో జరగనుందని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి జయవీర్, సీహెచ్.ఎల్.ఎన్. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ ఎంపిక జరుగుతుందని వివరించారు. వచ్చే నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రకాశం జిల్లా జె.పంగులూరులో జరిగే పోటీల్లో ఎంపికైన వారు తలపడనున్నారని పేర్కొన్నారు.

ఉధృతంగా సర్పానది ప్రవాహం



పరవళ్లు తొక్కుతున్న సర్పానది

మాకవరపాలెం, ఆగస్టు 26: మండలంలో సర్పానది సోమవారం ఉదయం నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో సర్పానదిలో నీటి ప్రవాహం పెరిగింది. అయితే పీపీ అగ్రహారం వద్ద జలపాతం తరహాలో ఇక్కడ నీటి ప్రభావం కనబరచడంతో స్థానికులు చూసేందుకు పోటీ పడుతున్నారు.

నేడు అప్పన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

▸▸ సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం, ఆగస్టు 26: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందులో భాగంగా ఉత్సవం రాత్రి ఆరాధనల తరువాత సుమారు 8 గంటల సమయంలో ఆలయ బేడామండపంలోని ప్రత్యేక పాలరాతి సింహాసనంపై జనన ఘట్టాన్ని ఆవిష్కరించటం ఆచారంగా వస్తోంది. ఉత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటల వరకు అప్పన్నస్వామి దర్శనాలు భక్తులకు లభిస్తాయి. అలాగే మధ్యాహ్నం 11.30 గంటల నుంచి గంట పాటు ఉండాల్సిన రాజభోగం నివేదన బ్రేక్ ఉండదు. దీంతో ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు స్వామివారి దర్శనాలు భక్తులకు నిర్విరామంగా లభిస్తాయి. రాత్రి ఆరాధన టికెట్ల విక్రయాలు రద్దు చేశారు. ఈ నెల 28 సాయంత్రం 4.30 గంటలకు ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద ఉట్ల సంబరం వేడుకగా నిర్వహిస్తారు.

వంతెనపై రోడ్డు ఇంతేనా..

- పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులకు ఇబ్బందులు
- నిత్యం రద్దీగా ఉన్నా.. గత ఐదేళ్లుగా పట్టించుకోని పాలకులు
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని కొత్తూరు వాసులు వినతి



పెద్ద పెద్ద గోతులతో ఉన్న కొత్తూరు బ్రిడ్జిపై రహదారి

కొత్తూరు, ఆగస్టు 26 : అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరు వద్ద కశింకోట- బంగారు మెట్టకు వెళ్లే బ్రిడ్జి ప్రధాన రోడ్డు మార్గం గోతులమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు సుమారు 35 గ్రామాల వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ బ్రిడ్జి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇదే మార్గంలో రైతులు, వ్యాపారస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. సుదూర ప్రాంతాలైన చోడవరం, వడ్డాది, మాడుగుల, పాడేరు వంటి ఊళ్లకు ఇటుగానే ప్రయాణికులు వెళ్లివస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న రహదారిపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సాగునీటి చెరువులు కళకళ



నిండుకుండలా దర్శనమిస్తున్న పరవాడ పెద్ద చెరువు

పరవాడ, ఆగస్టు 26 : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు సాగునీటి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో కాసిన ఎండల కారణంగా చాలా వరకు చెరువులు చుక్కనీరు లేక అడుగంటిపోయాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పలు చెరువుల్లో నీరు చేరడంతో నిండుకుండలా దర్శనమిస్తుంది. ముఖ్యంగా పరవాడ పెద్ద చెరువు, పరవాడ సన్యాసిచెరువు, పైడమ్మ బంద చెరువు, గొల్లమ్మ బంద చెరువు, మూలస్వయంభూవరం, స్వయంభూవరం, కలపాక, కొత్త వెన్నెలపాలెంలో చెరువులు నిండుకుండలా మారాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు నీటికి ఢోకా ఉండదని చెబుతున్నారు. మున్ముందు వర్షాలు పడితే ఇటు కూరగాయల పంటలకు, అటు వరి పంటకు పూర్తిస్థాయిలో నీరు ఉంటుందని అంటున్నారు.



నీటితో కళకళలాడుతున్న పైడమ్మ బంద చెరువు

కిక్ బాక్సింగ్ పోటీల విజేతలకు సత్కారం



క్రీడాకారులను సత్కరించిన గణేష్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 : గోవాలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ సీనియర్స్ మాస్టర్స్ విభాగాల్లో రాష్ట్రం తరపున తలపడి విజేతగా నిలిచిన అనకాపల్లి వాసి మాటూరి సన్నికుమార్, గొర్లి శ్యామ్‌లను స్థానిక భీమునిగుమ్మం జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ సోమవారం సత్కరించారు. జైభీమ్ యూత్ బాక్సర్స్ క్లబ్ విద్యార్థులైన వీరు భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో వీధిపెద్దలు పందిరి దయాల్‌రాజ్, పోతల శ్రీను, ఎస్.రామకృష్ణ, పి.గోవింద, రమేష్, బండి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తోడేళ్లు

... 5వ పేజీ తరువాయి

పోలీసులు పట్టుకున్నారు. డీఎల్‌పురం, వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, అమలాపురం, పాటిమీద, మూలపర్ర, తదితర గ్రామాల్లో రాత్రి వేళల్లో కొందరు ట్రాక్టర్లు, లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మరికొందరు సముద్రపు ఒడ్డు నుంచి నాటుబండ్లతో సముద్రపు ఇసుకను తరలించి, తోటల్లో నిల్వ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ జోష్

... 5వ పేజీ తరువాయి

4జి టవర్లుగా అప్‌గ్రేడ్ చేయిస్తున్నారు. ఇప్పటివరకూ 28 టవర్లను అప్‌గ్రేడ్ చేశారు. అలాగే ప్రాజెక్టు 4జి శాచ్యురేషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 800 వరకూ 4జి టవర్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే 50 టవర్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. డిసెంబరు నాటికి మొత్తం టవర్లు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు సాగుతున్నట్టు అధికారులు చెబుతు న్నారు. ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపా యాన్ని కల్పించడమే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ 4జి టవర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు ప్రీ, పోస్టు పెయిడ్ విని యోగదారులు 4.3 లక్షల మంది ఉన్నారు. వీరిలో 30 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియో గదారులు కాగా, మిగిలిన నాలుగు లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు. రానున్న రెండు, మూడు నెలల్లో వినియోగదారుల సంఖ్య ఐదు లక్షలు దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.



అనకాపల్లి గౌరీ పంచాయతన ఆలయంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



నక్కపల్లి మండలం మామిడివానిపాలెం కృష్ణ మందిరంలో స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు



పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో రాధాకృష్ణుల వేషధారణలు

జయకృష్ణా ముకుందా మురారీ..

- ఇంటింటా భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- కిటకిటలాడిన స్వామి ఆలయాలు
- పలు చోట్ల చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామివారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అనకాపల్లి పట్టణం జాతీయ రహదారిలోని హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం, సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ వేడుకలు ఘనంగా జరిపారు. ఉట్టికొట్టే ఉత్సవంలో యువతీ యువకులు ఉత్సాహం పాల్గొన్నారు. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో పిల్లలు అలరించారు. అలాగే, ఇక్కడి గౌరీ పంచాయతన ఆలయంలోని గౌరీ గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తుల సహకారంతో వివిధ రకాల మిఠాయిలు, పండ్లతో స్వామివారిని అలంకరించారు. చిన్నారులకు రాధాకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి, ఉట్టి ఉత్సవనిర్వహించారు.

కొత్తూరు : ఇక్కడి మొల్లివారి వీధిలో శ్రీకృష్ణ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు మొదలుకొని తొమ్మిది రోజుల పాటు ఇక్కడ ప్రతిరోజూ స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. రోజుకో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట కోనేరు గట్టు వద్ద ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. సీఐ అల్లు స్వామినాయుడుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాయకరావుపేట/రూరల్ : శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గోపూజలు నిర్వహించారు. ఉట్టికొట్టే సంబరం ఉత్సాహంగా



సబ్బవరం ప్రతిభ విద్యాలయంలో రాధాకృష్ణుల వేషధారణలో బాలబాలికలు

సాగింది. పిల్లలు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించారు. పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంతో పాటు గొల్లపేట శ్రీకృష్ణాలయంలో ఈ వేడుకలు మరింత ఘనంగా జరిగాయి. వివిధ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. నక్కపల్లి ఆంజనేయఆలయం వద్ద ప్రత్యేకంగా కృష్ణాష్టమి వేడుకలు జరిపారు. అలాగే, మామిడివానిపాలెం , కొర్రవానిపాలెం గ్రామాల్లో అట్టహాసంగా ఈ వేడుకలను జరిపారు. వేంపాడు, గొడిచెర్ల, దేవవరం, డీఎల్‌పురం, బుచ్చిరాజుపేట, జానకయ్యపేట, నెల్లిపూడి తదితర గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఎస్.రాయవరం : కృష్ణాష్టమిని మండలంలో ఘనంగా జరుపుకు న్నారు. పెట్టుగోళ్లపల్లి, కొత్తపోలవరం, కోనవానిపాలెం, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలుచోట్ల ఉట్టిసంబరం ఆనందోత్సాహాల నడుమ సాగింది. వివిధ పార్టీల నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలోని గ్రామ గ్రామాన కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోటవురట్ల, లింగాపురం, బీకేపల్లి, కైలాసపట్నం, పాములవాక తదితర గ్రామాల్లోని స్వామివారి ఆలయాల్లో టీడీపీ, వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పిల్లలు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

ఎలమంచిలి : కృష్ణాష్టమి పర్వదినాన్ని మండల వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎలమంచిలిలోని కాకివాని వీధి శ్రీకృష్ణుని ఆలయం, చారిత్రాత్మక వేణుగోపాలస్వామి ఆలయం, గొల్లలపాలెం సీతారాముల ఆలయం, కొక్కిరాపల్లి, పెదపల్లి వార్డుల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఏటికొప్పాక, పులపర్తి, పీఎన్ఆర్‌పేట, లక్కవరం గ్రామాల్లోనూ ఈ వేడుకలను జరిపారు. సాయంత్రం ఉట్టి సంబరాలు అంబరాన్నంటాయి.

రాంబిల్లి : కృష్ణాష్టమి వేడుకను మండల వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హరిపురం, గోవిందపాలెం, అప్పన్నపాలెం, ధారభోగాపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువత పోటీపడ్డారు. పలువురు నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పరవాడ : మండలంలో కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలో కృష్ణాష్టమి వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సబ్బవరంలోని ప్రతిభ విద్యాలయంలో బాలబాలికలు చిన్నికృష్ణుడు, రాధా, గోపికల వేషధారణతో అలరించారు. పెద్ద సంఖ్యలో నృత్యాలు చేస్తూ ఉట్టి సంబరంలో సందడి చేశారు. విద్యాలయం యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.







పాయకరావుపేటలో..., ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లిలో...,కోటవురట్లలో..., రాంబిల్లి మండలం హరిపురంలో..., అనకాపల్లి మండలం కొత్తూరులో స్వామివారికి వివిధ పార్టీల నాయకులు పూజలు

ఘనంగా మదర్ థెరిసా జయంతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 : ఇక్కడి కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లో సోమవారం మదర్ థెరిసా జయం తిని నిర్వహించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మహిళా ఎస్ఐ పి. రాములమ్మ హాజరై థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా థెరిసా సేవలను ఆమె కొనియాడారు. అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, కృష్ణమోహన్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే, సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరమేష్ ఆధ్వర్యంలో థెరిసా జయంతిని జరిపారు.



థెరిసా విగ్రహానికి పూలమాల వేస్తున్న మహిళా ఎస్ఐ రాములమ్మ

వెంకట్రావు సేవలకు అబ్దుల్ కలాం పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సింగంపల్లి వెంకట్రావు

సబ్బవరం, ఆగస్టు 26 : మండల కేంద్రం సబ్బవరంలోని జోడుగుళ్లకు చెందిన బంగారుతల్లి సేవా సమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకట్రావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారం లభించింది. మదర్ థెరిసా జయంతి సందర్భంగా విజయవాడలోని మదర్ సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు, ఎన్జీవో అసోసియేషన్ జాతీయ కార్యదర్శి మల్లాది ప్రసాదరావు సోమవారం ఈ పురస్కారంతో వెంకట్రావును సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వెంకట్రావు ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా అందిస్తున్న సేవలకు గుర్తింపే ఈ పురస్కారంగా పేర్కొన్నారు. బంగారుతల్లి సేవా సమితి సభ్యులు కోన నూకరాజు, గెడ్డం సూరిబాబు, నూరెడ్డి నాగరాజు, జెట్టి శ్రీను పాల్గొన్నారు.

యర్రవరం సమీపంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

ఎలమంచిలి, ఆగస్టు 26 : మునిసిపాలిటీ పరిధి యర్రవరం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖ ఐ ఆస్పత్రి వైద్య బృందం పలు వాహనాల డ్రైవర్లు, క్లీనర్లతో పాటు స్థానికులకు పరీక్షలు జరిపారు. అనంతరం కంటి సంరక్షణలో తీసుకోవాల్సింది జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో బంకు సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో భయం..భయం

- టైర్లకు ఇరు పక్కలా ఇనుప చక్రాలు ఉండడంతో పొంచి ఉన్న ప్రమాదం
- రోడ్లు సైతం పాడవుతున్నాయని ఆవేదన



ఎలమంచిలి- అచ్యుతాపురం రోడ్డుపై వెళుతున్న దమ్ము ట్రాక్టర్

ఎలమంచిలి, ఆగస్టు 26 : నిత్యం రద్దీగా ఉండే రహదారులపై దమ్ము ట్రాక్టర్లు వెళుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా టైర్లకు ఇరుపక్కలా ఐరన్‌తో కూడుకున్న దమ్ము చక్రాలు ఉండడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు హడలిపోతున్నారు. అలాగే, రోడ్లు కూడా పాడవుతున్నాయని అంటున్నారు. వ్యవసాయ పనుల సీజన్ కావడంతో ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం వెళ్లే రహదారిలో ఎక్కువగా ఇటువంటి ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. ఈ ట్రాక్టర్లను రోడ్లపై నుంచి పంట పొలాలకు తీసుక వెళుతుండడం వల్ల పలుచోట్ల రోడ్లు గోతులు పడి దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రధాన రోడ్లపై ఇటువంటి ట్రాక్టర్లను రద్దీ సమయాల్లో నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

చెత్త నిర్వహణపై మునిసిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి

- ఎట్టకేలకు స్పందించిన ప్రజారోగ్య విభాగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వృథాగా ఉన్న డస్టుబిన్‌లను తరలిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, ఆగస్టు 26 : మునిసిపాలిటీలో చెత్త నిర్వహణ తీరు అధ్వానంగా మారడంతో ఎట్టకేలకు ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. ఎలమంచిలిలో పలు చోట్ల ప్రజలు చెత్తా చెదారాన్ని వేసే కంపక్టర్, ట్విన్ బిన్‌లు తిరగేసి ఉండడంతో నిరుపయోగంగా మారాయి. ఈ విషయాన్ని మునిసి'పల్టీ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన సదరు అధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆయా బిన్‌లను సరిచేసి పెట్టించారు. అలాగే, ఇంటింట చెత్త సేకరణకు ఈ-ఆటోలు రావడంతో కొన్నింటిని ప్రజారోగ్య శాఖకు చెందిన స్టోర్ రూమ్‌కు తరలించి భద్రపరిచారు.



శారదానగర్ మూడవ వీధిలో మురుగు తిష్ఠ

- ఇటు దుర్వాసన..., అటు దోమల బెడదతో నివాసితులకు తీవ్ర ఇబ్బందులు



వీధిలో నిల్వ ఉన్న మురుగునీరు

కొత్తూరు, ఆగస్టు 26 : ఇక్కడి శారదానగర్ మూడవ వీధిలో మురుగు తిష్ఠ వేసింది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగి చీకటి పడితే కంటిమీద కునుకు ఉండడం లేదని ఆయా ప్రాంతాలవారు వాపోతున్నారు. ప్రధానంగా కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షపు నీరు, వాడుక నీరు రోడ్డుపైనే ప్రవహించి ఎక్కడిదక్కడే నిలిచిపోతోందని అంటున్నారు. ఇక్కడ సుమారు నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. మురుగు వల్ల దోమలు పెరిగి అంటువ్యాధుల భయం వెంటాడుతోందని అక్కడివారు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇక్కడి సమస్యను పరిష్కరించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేముళ్లు దీక్ష భగ్నం

- ఆరోగ్యం క్షీణిస్తుండడంతో ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- పెదకలవలాపల్లిలో గ్రామస్థులు ఆందోళన
- పోలీసులతో వాగ్వాదం
- కూటమి నేతల సమాధానంతో విరమణ

రాంబిల్లి, ఆగస్టు 26 : మండలంలోని పెదకలవలాపల్లిలో గత ఐదు రోజులుగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. గ్రామస్థులకు జీవనాధారమైన కొండ చుట్టూ నేవీ అధికారులు డీఆర్‌డీవో ద్వారా ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతుండడంతో గ్రామస్థులు ఉపాధితో పాటు అన్ని విధాలా నష్టపోతున్నారని ఆరోపిస్తూ, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని దేముళ్లు ఈ ఆందోళన చేపట్టారు. అయితే ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందని తెలుసుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అతని దీక్షను భగ్నం చేసి, ఎలమంచిలి సీహెచ్‌సీకి వైద్య చికిత్సల నిమిత్తం తరలించారు. దీనిపై గ్రామస్థులు సోమవారం గ్రామంలో ఆందోళనకు దిగారు. రోడ్డుపైకి వచ్చి వాహనాలను నిలిపివేసి, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమ సమస్యపై సుమారు 300 రోజులకు పైగా గ్రామ మహిళా రైతులతో కలిసి రామాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేపట్టినా గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం పట్టించుకో లేదన్నారు. ఈ కారణంగా దేముళ్లు ఆమరణ నిరాహార దీక్షకు దిగినట్టు చెప్పారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గ్రామస్థులు వాహనాలను స్తంభింపజేసి, పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో సీఐ నర్సింగరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గ్రామస్థుల ఆందోళనకు సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు మద్దతు పలికారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాల మేరకు రాంబిల్లి మండల టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకదొర ఆందోళనకారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే విజయకుమార్ అధికారులతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నారని, పదిహేను రోజులు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో వారు అక్కడ ఆందోళనను విరమించారు. అయితే సమస్య పరిష్కారమయ్యే వరకు గ్రామంలోని రామాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రి సింహగిరి ప్రసాద్, మాజీ సర్పంచ్ పి.తాతబాబు, చినకలవలాపల్లి సర్పంచ్ వై.శ్రీనివాసరావు, గ్రామ ఉప సర్పంచ్ గణేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రోడ్డుపై బైటాయించి నినాదాలు చేస్తున్న పెదకలవలాపల్లి గ్రామస్థులు

నర్సీపట్నం నియోజకవర్గం

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


మృతి చెందిన సత్తిబాబు

గొలుగొండ, ఆగస్టు 26: కొత్త మల్లవరం గ్రామ మాజీ సర్పంచ్ శెట్టి సత్తిబాబు అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆదివారం ఆయన అస్వస్థతకు గురవడంతో కేజీహెచ్‌కు వైద్యం కోసం తరలించారు. వైద్యం పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతికి టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, కొత్తఎల్లవరం సర్పంచ్ కొల్లి రాంబాబు, టీడీపీ నాయకులు చిటికెల సాంబమూర్తి, గెడ్డం సత్యనారాయణ, గొల్లు సత్తిబాబు, కొల్లాన కొండలరావు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హెల్మెట్‌పై యువతకు అవగాహన

గొలుగొండ, ఆగస్టు 26: హెల్మెట్ ధరించడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. సోమవారం గొలుగొండ గ్రామంలో హెల్మెట్‌పై యువకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలతో ప్రయణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కారు డ్రైవింగ్‌లో సీటు బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

» పెద్ద పెద్ద గోతులతో తిప్పలు » తరచూ ప్రమాదాలు » పట్టించుకోని అధికారులు, పాలకులు


నాతవరంలో పాడైన మెయిన్ రోడ్డు


గుమ్మిడిగొండ-సరుగుడు రోడ్డులో ఏర్పడిన గోతులు

నాతవరం, ఆగస్టు 26 : మండలంలో ప్రధాన రహదారులు వర్షాలకు మరింత అధ్వానంగా తయారవ్వడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై గోతులు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి అప్‌లో గోతులతో ఉన్న రోడ్డుపైకి వెళ్లేటప్పుడు ఒక్కొక్కసారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మెయిన్‌రోడ్డు అధ్వానంగా ఉన్నా కనీసం మరమ్మతులు చేపట్టలేదని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే తాండవ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడిన గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. జనసేన, టీడీపీ నాయకులు సొంత నిధులతో గోతులను తాత్కాలికంగా పూడ్చివేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతులు మళ్లీ యథాస్థితికి వచ్చాయని ప్రయాణికులు తెలిపారు. చమ్మచింత తాండవ ఆడాకుల, మాధవనగరం తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగపడే తాండవ రోడ్డు గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. కనీసం గోతులు పూడ్చడానికి కూడా ముందుకు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే గుమ్మిడిగొండ-సరుగుడు రోడ్డు వర్షాలకు మరింత అధ్వానంగా మారడంతో స్కూల్ బస్సులలో వెళ్లే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు చేస్తున్నారు. అలాగే తుని-నర్సీపట్నం రోడ్డు నుంచి మన్యపురట్ల వెళ్లే రోడ్డు గోతులమయం కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏపీపురం, ఉప్పరగూడెం, మన్యపురట్ల తదితర గ్రామాల ప్రజలకు ఈ రోడ్డే శరణ్యం కావడంతో వారు పడే బాధలు వర్ణనాతీతం. అదేవిధంగా వెదురుపల్లి-గొలుగొండపేట రోడ్డు దారుణంగా ఉండడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే తుని-నర్సీపట్నం రూట్‌లో ఎ. శరభవరం రోడ్డు గోతులు ఉండటంతో ఇక్కడ వాహనాలు బోల్తా కొడుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి అధ్వాన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సందడిగా జాతీయ క్రీడా దినోత్సవం



స్పోర్ట్స్ డే సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

నర్సీపట్నం, ఆగస్టు 26 : ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పలువురు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించుకోవడానికి, ఫిట్‌నెస్ కోసం ప్రతి రోజూ అరగంట సమయం కేటాయిస్తానని వాకర్స్, బాక్సింగ్, వాలీబాల్, షటిల్, క్రికెట్, క్రీడాకారులు సభ్యులతో ప్రతిజ్ఞ చేశారు. క్రీడా దినోత్సంలో భాగంగా ఈనెల 31 వరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడలపై అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ శేఖర్, ప్రియాంక, వెలగా నారాయణరావు, అబ్బు పాల్గొన్నారు.

'మదర్ థెరీసా సేవలు ఆదర్శనీయం'


మదర్ థెరీసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నర్సీపట్నం, ఆగస్టు 26 : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరీసాజయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మదర్ థెరీసా నిరుపేదలకు, రోగులకు ఎనలేని సేవలు చేశారన్నారు. ఆమె అందించిన సేవలకు రామన్ మెగసేసే శాంతి బహుమతి, నోబెల్ శాంతి బహుమతి సహా అనేక గౌరవాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అల్లు అప్పారావు, ఉపాధ్యక్షుడు ఎంవీ రంగారావు, సంయుక్త కార్యదర్శి పి. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శంకర్‌రెడ్డి, అడిగర్ల వరహాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో.. మండలంలో తామరంలో మదర్ థెరీసా జయంతి వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు మాట్లాడుతూ ఆమె అడుగు జాడల్లో ప్రతది ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి

నర్సీపట్నం, ఆగస్టు 26 : శ్రీకృష్ణ జన్మాష్టమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం స్థానిక కృష్ణాబజార్‌లోని శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణ భక్తమండలి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు క్యూలో ఉండి శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం, చిడతలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గొలుసు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో.. కృష్ణాష్టమి వేడుకలను ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, నాగాపురం తదితర గ్రామాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఏఎల్‌పురం గొల్లవీధిలోని కృష్ణుడు ఆలయంలో యాదవసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయం వద్ద అన్నసమరాధన చేపట్టారు. ఈ సందర్భంగా సాయంత్రం వీధుల్లో ఉట్టి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు.

మాకవరపాలెంలో.. మండలంలో పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకులను ఘనంగా నిర్వహించారు. జి.వెంకటాపురం, సీతన్నఅగ్రహారం, మాకవరపాలెం బీసీ కాలనీలో వేడుకులను నిర్వహించారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.

నాతవరంలో.. మండలంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లేడిపూడి శ్రీకృష్ణ ఆలయంలో ఉదయం నుంచే భక్తులు పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు. అలాగే గన్నవరంమెట్టలో గొంప కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిఇన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో జనసేన నియోజకవర్గ నాయకులు రాజాన వీరసూర్యచంద్ర పాల్గొన్నారు.


నర్సీపట్నం శ్రీకృష్ణుడు ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


గోపికలు, శ్రీకృష్ణుడు వేషధారణలో చిన్నారులు


ఏఎల్‌పురం కృష్ణుడు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇసుక తోడేళ్లు

... 5వ పేజీ తరువాయి

పోలీసులు పట్టుకున్నారు. డీఎల్‌పురం, వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, అమలాపురం, పాటిమీద, మూలపర్ర, తదితర గ్రామాల్లో రాత్రి వేళల్లో కొందరు ట్రాక్టర్లు, లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మరికొందరు సముద్రపు ఒడ్డు నుంచి నాటుబండ్లతో సముద్రపు ఇసుకను తరలించి, తోటల్లో నిల్వ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ జోష్

... 5వ పేజీ తరువాయి

4జి టవర్లుగా అప్‌గ్రేడ్ చేయిస్తున్నారు. ఇప్పటివరకూ 28 టవర్లను అప్‌గ్రేడ్ చేశారు. అలాగే ప్రాజెక్టు 4జి శాచ్యురేషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 800 వరకూ 4జి టవర్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే 50 టవర్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. డిసెంబరు నాటికి మొత్తం టవర్లు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు సాగుతున్నట్టు అధికారులు చెబుతు న్నారు. ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపా యాన్ని కల్పించడమే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ 4జి టవర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు ప్రీ, పోస్టు పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది ఉన్నారు. వీరిలో 30 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు కాగా, మిగిలిన నాలుగు లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు. రానున్న రెండు, మూడు నెలల్లో వినియోగదారుల సంఖ్య ఐదు లక్షలు దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

చోడవరం నియోజకవర్గం


పింఛన్ కోసం ఎమ్మెల్యే రాజును కోరుతున్న ఈశ్వరమ్మ

పింఛన్ పెంపునకు చర్యలు చేపట్టాలి

» ఎమ్మెల్యే రాజును కోరిన దివ్యాంగుడు తల్లి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 26: శతశాతం అంగవైకల్యం కలిగిన తన కుమారుడికి బెడ్ రీడెడ్ ఫించన్ రూ.15 వేలు మంజూరుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం వడ్డాది ఈబీసీ కాలనీకి చెందిన దివ్యాంగుడు కోరసాల మధు తల్లి ఈశ్వరమ్మ చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజును వేడుకున్నారు. పోలియో కారణంగా తన బిడ్డ పుట్టినప్పటి నుంచి రెండు కాళ్లు, చేతులు చచ్చు పడిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడని, మాట కూడా రాని మధుకు అంగవైకల్యం 70 శాతం ఉన్నట్టు వైద్యులు సదరం సర్టిఫికెట్‌ను మంజూరు చేశారిన వాపోయారు. బెడ్ రీడెడ్ కలిగిన తన కుమారుడుకి శతశాతం అంగవైకల్యం సర్టిఫికెట్ మంజూరు చేయాలని వైద్యులను కోరినా ఫలితం లేకుండా పోయిందని ఈశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రాజు హామీ ఇచ్చారు.

ఆటోపై పడిన విద్యుత్ స్తంభం


డబ్ల్యూపీ రోడ్డులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 26: వడ్డాది-పాడేరు (డబ్ల్యూపీ) రోడ్డులో సోమవారం తెల్లవారుజామున కురిసన భారీ వర్షానికి పార్క్ చేసి ఉన్న ఆటోపై విద్యుత్ స్తంభం కూలిపోయింది. దీంతో ఆటో దెబ్బతింది. తెల్లవారుజాము కావడంతో ఎవరూ సంఘటనా స్థలంలో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమాచారం తెలుసుకున్న వడ్డాది ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎ.కృష్ణకు చెందిన ఆటో దెబ్బతింది.

యూపీఎస్‌ను వెనక్కి తీసుకోవాలి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఆమోదించిన యునిఫెడ్ పెన్షన్‌స్కీమ్ (యూపీఎస్)ను వెనక్కి తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేకేఎల్ఎన్.ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ఆమోదించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జీపీఎస్)కు, కేంద్రం ఆమోదించిన యూపీఎస్‌కు పెద్దగా తేడా లేదన్నారు. పాత పెన్షన్ విధానం కోసం ఏళ్ల తరపడి చేస్తున్న పోరాటాలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ పేరు మార్పుతో ఉపాధ్యాయ, ఉద్యోగులను మోసం చేసే కొత్త ప్రక్రియను ప్రారంభించడాన్ని ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తున్నదన్నారు. బేషరతుగా పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చోడవరం/బుచ్చెయ్యపేట/రావికమతం/రోలుగుంట/కె.కోటపాడు/మాడుగుల రూరల్/, ఆగస్టు 26: చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఉట్ల సంబరాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చోడవరం వేణుగోపాలస్వామి, ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణ ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని కృష్ణుడి ఆలయాల్లో వేడుకలు ఉల్లాసంగా జరుపుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు కృష్ణుడిని దర్శించుకుని పూజలు చేశారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది, ఎల్‌బీపీ.అగ్రహారం, పొట్టిదొరపాలెం, పెదపూడి, పెదమదీనా, కందిపూడి, మల్లాం, బుదిరెడ్లపాలెం తదితర గ్రామాల్లో వేకువ జాము నుండి భక్తులు దర్శనానికి తరలిరావడంతో కృష్ణాలయాలు కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, కూటమి నాయకులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. రావికమతం మండలంలోని కొత్తకోట, దొండపూడి, తట్టబంద శ్రీకృష్ణాలయాల్లో సోమవారం ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం కొత్తకోట, దొండపూడి, గుమ్మాళ్లపాడు గ్రామాల్లో యువకులు ఎంతో ఉత్సహంగా ఉట్టి సంబరం నిర్వహించారు. అలాగే కొమిర గ్రామంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకులను ఘనంగా నిర్వహించారు. వడ్డిప వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గజ్జి సాంబశివరావు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. రోలుగుంటలో వేంకటేశ్వర యువజన సేవా సంఘం ద్వారా సంఘ అధ్యక్షుడు సుర్ల రమణ గిరి గోవర్ధనరావు (పంచాయతీ రమణ) ఆధ్వర్యంలో వేడుకులను నిర్వహించారు. మాడుగుల మండలంలోని మోకాసా కృష్ణాపురంలో కృష్ణాలయంలో యాదవ సంఘం చిన్ని కృష్ణ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. చిడతల భజనలు, ఉట్టి సంబరం, అన్నసమారాధన నిర్వహించారు. సాగరం గ్రామంలో కూడా ప్రత్యేక పూజలు చేసి అన్నసమారాధాన చేశారు. చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధా, గోపికలు వేషదారణ చేయించి తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయారు. కె.కోటపాడు మండలంలోని కృష్ణుడు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గుల్లేపల్లి, గరుగుబిల్లి, సూదివలస, ఆర్‌వై.అగ్రహారం, గవరపాలెం, పింద్రంగి, సింగన్నదొరపాలెం తదితర గ్రామాల్లో అన్నదానాలు జరిగాయి. ఆయా గ్రామాల యాదవ సంఘాల సభ్యులతో పాటు గ్రామస్థులంతా ఆయా పూజా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


చోడవరం కృష్ణాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రావికమతం: గుమాళ్లపాడులో ఉట్టి కొడుతున్న యువకులు

పేదలకు అండగా జనసేన

» పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, ఆగస్టు 26: పేదలకు అండగా జనసేన ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీకి చెందిన ఉపసర్పంచ్ మురుగుతి సింహాచలంనాయుడు, నాయకులు జోగా గంగరాజు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, సంయుక్త కార్యదర్శి ఎడ్ల రామ్మూర్తి, నాయకులు పల్లా మాలినాయుడు, సియ్యాద్రి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలాల ధర పతనం.. నిరాశలో గిరిజనం



మాడుగుల, ఆగస్టు 26: గిరిజన ప్రాంతాల నుంచి మాడుగుల వారపు సంతలో విక్రయించేందుకు తీసుకు వచ్చిన సీతా ఫలాలు ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. పాడేరు ఏజెన్సీ మండలాలకు చెందిన దేవాపురం, వంట్లమామిడి, సలుగు, కందులపాలెం, ఈదులపాలెం, కక్కి, పులుపుమామిడి తదితర గ్రామాల్లో పండే ఈ ఫలసాయాలను మాడుగులలో సోమవారం జరిగే వారపు సంతకు నెత్తి బరువు, కావిడిమోత సహాయంతో విక్రయించేందుకు తీసుకువస్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 50 పండ్లు కలిగిన తట్ట రూ.300 నుంచి రూ.400కు మాత్రమే అమ్మకాలు జరిగాయి. గతంలో సీతాఫలాలు సైజునుబట్టి అదే 50 పండ్లు కలిగిన తట్ట రూ.800 నుంచి వెయ్యి రూపాయలు వరకూ విక్రయాలు జరిగేవి. సగానికి సగం ధర పడిపోవడం, కొనుగోలుదారులు లేకపోవడంతో అదే సీతాఫలం రూ.200కు విక్రయించి రైతులు నిరాశతో వెనుదిరిగారు.


భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

గ్రామాల్లో భక్తిభావం పెంపొందించాలి

చీడికాడ, ఆగస్టు 26: గ్రామీణ ప్రాంతాల్లో భక్తిభావం పెంపొందించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని అప్పలరాజుపురం శ్రీకృష్ణదేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేసిన ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఏడాది గ్రామాల్లో జరిగే తీర్థాల్లో పూజలతో పాటు భజనలు చేస్తే ప్రశాంతత ఉంటుందన్నారు. అనంతరం దండిసురవరం, చుక్కపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అప్పలరాజుపురం గ్రామంలో జిల్లా భగవద్గీత పోటీలు ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మూడు గ్రామాల్లో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గవిరెడ్డి జగన్నాథం, కురచా సురేష్, గవిరెడ్డి శ్రీనివాసరావు, కుచ్చు కళావతి, రెడ్డి సన్యాసినాయుడు, శరగడం శివ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి: కృష్ణాష్టమి వేడుకల్లో బాగంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంంలో ఎంపీటీసీ మొల్లికృష్ణమూర్తి, బందం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. రాత్రి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మాడుగుల నియోజకవర్గం


ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు

వైద్యం కోసం బారులు

మాడుగుల, ఆగస్టు 26: వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియాతో పాటు వైరల్ జ్వరాలతో రోగులు మంచాన పడుతున్నారు. అలాగే వైద్యం కోసం మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో బారులు తీరుతున్నారు. వైద్యులు చికిత్స అందించి వ్యాధి తీవ్రతను బట్టి మందులు ఇవ్వడంతో పాటు కొంత మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటున్నారు. సోమవారం మాడుగుల మండలంతో పాటు చీడికాడ, పాడేరు మండల్లోని పలు గ్రామాలకు చెందిన రోగులు మాడుగులలో అధికంగా ఆస్పత్రికి చేరారు. వ్యాధుల నివారణకు వైద్య శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్య పనులు

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

చీడికాడ, ఆగస్టు 26: మండల పరిషత్ కార్యాలయం లోపల, ఆరుబయట పేరుకుపోయిన చెత్తను సోమవారం పంచాయతీ కార్మికులు తొలగించారు. 'ఎంపీడీవో కార్యాలయం వద్ద కంపు కంపు' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎ.సన్యాసిరావు చెత్తాచెదారాన్ని కార్మికులతో తొలగించి పరిపరిశుభ్రం చేయించారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇన్‌చార్జిగా సూర్యనారాయణ



కె.కోటపాడు, ఆగస్టు 26: ఉమ్మడి విశాఖ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇన్‌చార్జిగా మేడిచర్ల గ్రామానికి చెందిన మల్లువలస సూర్యనారాయణకు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తనవంతు సహకారం అందిస్తానని, విధులను అంకితభావంతో నిర్వహిస్తానని చెప్పారు.

1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

కె.కోటపాడు, ఆగస్టు 26: మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు చెప్పారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం పురోగతి సాధించిందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఇమంది సన్యాసిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శరగడం సన్యాసినాయుడు, దాలివలస ఎంపీటీసీ సభ్యుడు కొట్టాన అశోక్, బీజేపీ నాయకురాలు పైలా అమ్మాజీ, బీజేపీ నాయకులు బండారు సత్యనారాయణ పాత్రుడు, జనపరెడ్డి సూర్యనారాయణ, సూరిశెట్టి ఎరుకునాయుడు (దాసు), సబ్బవరపు శివ, బొడ్డు శ్రీరామమూర్తి, కొట్టాన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.